# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 281 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | శుక్రవారం 31-07-2026


## జిల్లా యంత్రాంగానికి సి.ఎస్. కీలక ఆదేశాలు



- భారీ వర్షాలపై అప్రమత్తం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, సహాయక బృందాల సిద్ధం

2

## వందేమాతరం బిల్లుపై ఒవైసీ విమర్శలు

- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపణ
- మత స్వేచ్ఛపై ప్రభావం చూపుతుందని వ్యాఖ్యలు



2



# ఉత్తర తెలంగాణను ముంచెత్తిన వానలు

**వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు**

- రెండు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు
- జంపన్న వాగులో భక్తుడు గల్లంతు
- లోతట్టు ప్రాంతాల్లో వరదల ముప్పు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గత 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

2



# వరదలపై మోదీ సమీక్ష

**రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం పూర్తి సహకారం**

- అరుణాచల్, నాగాలాండ్ ఎంపీలతో సమావేశం
- వరద పరిస్థితులపై విస్తృత చర్చ
- ప్రజల భద్రత కోసం చర్యలు వేగవంతం

**న్యూఢిల్లీ, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న వరద పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులతో సమావేశమయ్యారు. ఇటీవలి భారీ వర్షాలు, వరదల ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సహాయక చర్యల పురోగతిపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వరదల కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు చేపడుతున్న చర్యలపై ఎంపీలు ప్రధానికి వివరించినట్లు సమాచారం. రహదారులు, వంతెనలు దెబ్బతినడం, రాకపోకలకు

మిగతా 2 లో..

## వేములవాడ బస్‌స్టేషన్‌కు కొత్త రూపు




- రూ.1.62 కోట్లతో ఆధునీకరణ పనులకు శ్రీకారం
- కోరుట్ల మీదుగా బాసరకు కొత్త బస్సు ప్రారంభం
- మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతోందన్న మంత్రి
- ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి



## స్థానిక ఎన్నికలే లక్ష్యం

- ఆదోనిలో పార్టీ నేతలతో లోకేశ్ సమావేశం
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

2

## నైపుణ్య విద్యపై సీఎం దృష్టి

- పన్నెండో తరగతి తర్వాత నైపుణ్యాలపై దృష్టి
- ప్రభుత్వ విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యం
- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీపన్నెండో తరగతి తర్వాత నైపుణ్యాలపై దృష్టి

2



## నీటి నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీత




**శ్రీనివాస్ గౌడ్**

- వరద జలాలను నిల్వ చేయాలని డిమాండ్
- ఆల్మట్టి ఎత్తు పెంపుపై ఆందోళన

2



## ప్రియాంక వ్యాఖ్యలపై నిరసన

- 215 మంది విద్యావేత్తల బహిరంగ లేఖ
- శాస్త్రవేత్తను కించపరచడం తగదని అభిప్రాయం
- ఐఐటీ మద్రాస్ డైరెక్టర్‌కు మద్దతు
- పార్లమెంట్‌లో హుందాతనం పాటించాలని సూచన

2

## పరీక్షల బిల్లుపై ఖర్గే విమర్శలు

- విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వాన్ని నిలదీత
- అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్
- పేపర్ లీకేజీలపై ఆలస్యంగా స్పందించారని ఆరోపణ
- శాశ్వత పరిష్కారంపై సందేహం వ్యక్తం



**న్యూఢిల్లీ, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు–2026పై రాజ్యసభలో తీవ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే చర్యల కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు.

మిగతా 2 లో..



2

## 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం

- 2028లో తొలి మాడ్యూల్ ప్రయోగం
- గగన్‌యాన్‌లో కీలక పురోగతి

## పాఠశాల పక్కన సెల్ టవర్ నిర్మించొద్దు...



7

## ఎఫ్ఆర్‌సీ జారీలో జాప్యం

2

## నీటి నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీత

**హైదరాబాద్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

గోదావరి, కృష్ణా నదులకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున వరద జలాలు వస్తున్నాయని, ఈ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్లను నింపుకునే దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని దిగువకు విడుదల చేయడం సరికాదని, వెంటనే అన్ని పంపులను ప్రారంభించి ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకోవాలని కోరారు. పాలమూరు జిల్లాకు కృష్ణా, తుంగభద్ర, భీమ నదులే ప్రధాన ఆధారమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. కేవలం తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని నిల్వ ఉంచుతామనే ప్రభుత్వ వైఖరి సరైనది కాదని, వ్యవసాయానికి కూడా సమృద్ధిగా నీటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గోదావరి, కృష్ణా నదులపై ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి స్థాయిలో నడిపించాలని, రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లకు మరమ్మతులు చేపడితే మళ్లీ వినియోగంలోకి తీసుకురావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కన్నెపల్లి వద్ద మోటార్లను ప్రారంభించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో వంటి పరిస్థితులు వచ్చినా రాష్ట్రంలో కరువును తట్టుకునేలా కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రూపకల్పన చేశారని, ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తున్నా ఆ వ్యవస్థ కూడా గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ల ద్వారానే సాధ్యమవుతోందని పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం

**కర్నూలు, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ ఆదోని మండలం, పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా ఇంటింటికీ ప్రచార కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించేలా నాయకులు కార్యాచరణ రూపొందించాలని కోరారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. నాయకులు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించే విధంగా వ్యవహరించాలని సూచించారు.

## జిల్లా యంత్రాంగానికి సి.ఎస్. కీలక ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కొనసాగనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కేంద్రాల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. పోలీసు శాఖతో పాటు ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జలపాతాలు, ప్రమాదకర ప్రాంతాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల జిల్లాల కలెక్టర్లు వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సంజయ్ జాజు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు తరలింపు చర్యలు చేపట్టాలని, సహాయక శిబిరాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

## ఎఫ్‌ఆర్‌సీ జారీలో జాప్యం

**హైదరాబాద్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసిన రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు సరిగా లేకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకుపైగా దరఖాస్తులు అందినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే తొలిరోజే దరఖాస్తు చేసిన పలువురికి కూడా ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో వారు ప్రతిరోజూ మీసేవ కేంద్రాలకు వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత నెల 25న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 172 ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు పరిశీలన పూర్తి చేసి సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంది. అయితే అనేక మండలాల్లో ఈ గడువు పాటించకపోవడంతో దరఖాస్తుల పరిష్కారం ఆలస్యమవుతోంది.

## వందేమాతరం బిల్లుపై ఒవైసీ విమర్శలు

**న్యూఢిల్లీ, జులై 30 (నవజ్యోతి 18 ప్రతినిధి):**

పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వందేమాతరం బిల్లుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆరోపించారు. బిల్లుపై తమ పార్టీ అభ్యంతరాలను స్పష్టంగా వెల్లడించారు. జాతీయ గీతం 'జనగణమన', జాతీయ గేయంగా పరిగణిస్తున్న 'వందేమాతరం' మధ్య ఉన్న తేడాను కూడా ఒవైసీ ప్రస్తావించారు. 'జనగణమన' దేశ వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబిస్తుందని, అయితే 'వందేమాతరం' ఒక నిర్దిష్ట పూజా విధానం, దేవతారాధనకు సంబంధించిన భావాలను కలిగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా రెండింటినీ ఒకే కోణంలో చూడలేమని పేర్కొన్నారు.1950 నాటి పరిణామాలను ప్రస్తావించిన ఒవైసీ, అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పార్లమెంటులో ప్రత్యేక తీర్మానం లేకుండానే వందేమాతరానికి జాతీయ గేయ హోదా ప్రకటించారని అన్నారు. భారత రాజ్యాంగంలో గానీ, ప్రస్తుత చట్టాల్లో గానీ 'జాతీయ గేయం' అనే పదానికి స్పష్టమైన నిర్వచనం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత సవరణ చట్టం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ప్రభావితం చేస్తోందని ఒవైసీ ఆరోపించారు. ముఖ్యంగా ఆర్టికల్ 25, 26, 29 కింద పౌరులకు లభించే మత స్వేచ్ఛ, సాంస్కృతిక హక్కులపై ఈ చట్టం ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.

# ఉత్తర తెలంగాణను ముంచెత్తిన వానలు

**హైదరాబాద్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

పలు లోతట్టు ప్రాంతాలు జలమయమవగా, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. రహదారులపై వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు ప్రయాణాలు చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత ఆయా జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే తదుపరి పరిస్థితులను సమీక్షించి మరిన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ములుగు జిల్లాలోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. కన్నాయిగూడెం ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో వరద పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు వరద బాధితుల కోసం అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రమాద ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. సహాయక బృందాలు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మేడారంలో జంపన్న వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగులో స్నానం చేసేందుకు దిగిన ఘట్‌కేసర్‌కు చెందిన ఓ భక్తుడు నీటి ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు స్పందన బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించాయి. అయితే వాగులో ఉధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలను వేగవంతం చేస్తోంది.

## వరదలపై మోదీ సమీక్ష

**మొదటిపేజీ తరువాయి**

అంతరాయం, పునరావాస చర్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వంటి అంశాలు సమావేశంలో ప్రాధాన్యంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ వరదలతో ఏర్పడిన సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలు, అత్యవసర సేవల నిర్వహణలో కేంద్ర సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిసింది. అవసరమైన చోట ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయ కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించినట్లు సమాచారం. వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని ప్రధాని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన అదనపు సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం కొనసాగిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరి క్షేమం, భద్రత కోసం ప్రార్థిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి ప్రజలను సురక్షితంగా కాపాడాలని ఆయన ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషితో వరద పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.

## 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 30 (నవ జ్యోతి ప్రతినిధి):**

భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తొలి స్వదేశీ అంతరిక్ష కేంద్రం భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఐదు మాడ్యూళ్లతో నిర్మించనున్న ఈ అంతరిక్ష కేంద్రంలో తొలి మాడ్యూల్ బీఏఎస్–01ను 2028లో ప్రయోగించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం అంతరిక్ష కేంద్రాన్ని 2035 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభలో తెలిపారు. బీఏఎస్–01 మాడ్యూల్‌కు సంబంధించిన ప్రాథమిక రూపకల్పన సమీక్ష, వ్యవస్థల ఇంజినీరింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ మాడ్యూల్‌కు సంబంధించిన 31 ప్రాథమిక రూపకల్పన పత్రాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఉపవ్యవస్థల రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయని, మానవ అంతరిక్ష కార్యక్రమానికి అవసరమైన నమూనా పరికరాల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని వివరించారు. గగన్‌యాన్ కార్యక్రమంలో కూడా గణనీయమైన పురోగతి సాధించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. మానవులను అంతరిక్షంలోకి తీసుకెళ్లే సామర్థ్యం కలిగిన ప్రయోగ వాహనం, కక్ష్య మాడ్యూల్, వ్యోమగాముల రక్షణ వ్యవస్థ, భూమిపై అవసరమైన మౌలిక సదుపాయాలు, విమాన నిర్వహణ, సమాచార ప్రసార వ్యవస్థలు, వ్యోమగాముల రికవరీ వ్యవస్థల అభివృద్ధిలో కీలక దశలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. గగన్‌యాన్‌కు ముందు నిర్వహించిన టీవీ–డీ1, ఐఏడీటీ–01, ఐఏడీటీ–02 పరీక్షా మిషన్లు విజయవంతంగా పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. తొలి మానవరహిత గగన్‌యాన్ మిషన్ జీ–1కు సంబంధించిన ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. అంతరిక్ష కేంద్రాల అనుసంధానానికి అవసరమైన డాకింగ్ వ్యవస్థతో పాటు అంతరిక్షంలో ఇంధనం నింపే సాంకేతికతకు సంబంధించిన నమూనా పరీక్ష కూడా విజయవంతంగా పూర్తయిందని వివరించారు. స్వదేశంలోనే అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. కొత్త శకానికి నాంది పలికిన దేశంగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రియాంక వ్యాఖ్యలపై నిరసన

**న్యూఢిల్లీ, జులై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పలువురు విద్యావేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు శాస్త్రవేత్తలను కించపరిచే విధంగా ఉన్నాయని పేర్కొంటూ 215 మంది వైస్‌ఛాన్సలర్లు, మాజీ వైస్‌ఛాన్సలర్లు, ప్రముఖ విద్యావేత్తలు బహిరంగ లేఖ విడుదల చేశారు. లోక్‌సభలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు–2026'పై జరిగిన చర్చలో ప్రియాంక గాంధీ పరీక్షల సంస్కరణల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యబృందం సభ్యుల ఎంపికపై విమర్శలు చేశారు. ప్రసంగంలో ఆమె ఎవరి పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆ వ్యాఖ్యలు కార్యబృంద సభ్యుడైన ప్రొఫెసర్ వి. కామకోటిని ఉద్దేశించినవేనని రాజకీయ, విద్యా వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో విడుదలైన బహిరంగ లేఖలో రాజకీయ విమర్శల కోసం ఒక ప్రముఖ శాస్త్రవేత్తను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సరికాదని విద్యావేత్తలు పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని, ప్రజాప్రతినిధులు పార్లమెంట్‌లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రొఫెసర్ వి. కామకోటి విద్యా, పరిశోధనా రంగంలో చేసిన సేవలను లేఖలో ప్రస్తావించారు. ఐఐటీ మద్రాస్‌లోనే పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన 150కిపైగా పరిశోధన పత్రాలను ప్రచురించారని, డీఆర్‌డీఓ అకడమిక్ ఎక్సలెన్స్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారని గుర్తు చేశారు.

## పరీక్షల బిల్లుపై ఖర్గే విమర్శలు

**మొదటిపేజీ తరువాయి**

ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తాయని గుర్తు చేశారు. హోంశాఖ అనుమతి లేకుండా అలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని పేర్కొంటూ, ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై సభకు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ప్రభుత్వం ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చిందని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించే సంస్కరణలు చేపట్టకుండా ప్రభుత్వం రాజకీయ అంశాలపైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనల తర్వాత ఒత్తిడి పెరగడంతోనే ఈ బిల్లును తీసుకువచ్చారని ఆరోపించారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం మాత్రమే సరిపోదని ఖర్గే అన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీల నివారణకు ప్రభుత్వం అనుసరించే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తు చేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రభుత్వం స్పందించిందని ఆరోపించారు. మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ విమర్శలు, ఆరోపణలు మాత్రమే. ఈ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తన వాదనను సభలో వెల్లడించింది.

## నైపుణ్య విద్యపై సీఎం దృష్టి

**హైదరాబాద్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్య పూర్తిచేసిన అనంతరం విద్యార్థులను నైపుణ్యాధారిత విద్య, ఉపాధి అవకాశాల వైపు మళ్లించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా అధ్యయన పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన ఉపాధ్యాయ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ దాశరథి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నెండో తరగతి పూర్తయ్యే సమయానికి ప్రతి విద్యార్థికి ప్రపంచ పరిస్థితులపై సమగ్ర అవగాహన ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, వారు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి చేపట్టాల్సిన సంస్కరణలపై డిసెంబర్‌లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రతి మండలాన్ని ఒక విద్యా సమూహంగా ఏర్పాటు చేసి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రపంచ దేశాలు తెలంగాణ ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయుల నుంచి సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యలకంటే పిల్లల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు ఉంటే విదేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

## వేములవాడ బస్‌స్టేషన్‌కు కొత్త రూపు

**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ–కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. ఈ పథకం వల్ల మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరగడంతో పాటు ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి సుమారు రూ.11,668 కోట్ల మేర ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని వెల్లడించారు.1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని, రోజుకు దాదాపు 50 వేల మంది ప్రయాణికులు గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు దాదాపు రూ.100 కోట్లతో బస్‌స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

# స్టేటస్‌లు పెరుగుతున్నాయి... బంధాలు ఎందుకు తగ్గిపోతున్నాయి?

- **డిజిటల్ ప్రపంచంలో మనిషి దగ్గరవుతున్నాడా... లేక మెల్లగా మనిషే మాయమవుతున్నాడా?**



ఈ రోజుల్లో మనిషి చేతిలో ప్రపంచం ఉంది... కానీ పక్కనే ఉన్న మనిషికి మాత్రం దూరమవుతున్నాడు. సోషల్ మీడియాలో వేలాది మంది స్నేహితులు, లక్షల మంది ఫాలోవర్లు, రోజూ మారే స్టేటస్‌లు, నిమిషానికో రీల్... ఇవన్నీ పెరుగుతున్నా, నిజమైన బంధాలు మాత్రం మెల్లగా కనుమరుగవుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ ఆత్మను అక్షరాల్లో బంధించిన ప్రముఖ కవి అందెశ్రీ ఎన్నాళ్లక్రితమే రాసిన పదాలు నేడు మరింత అర్థవంతంగా వినిపిస్తున్నాయి. "మాయమై పోతున్నడమ్మా... మనిషన్న వాడు... మచ్చుకైనా లేడు... చూడుమానవత్వము ఉన్నవాడు..." ఒకప్పుడు ఇది జానపద గీతం మాత్రమే. ఇప్పుడు సమాజానికి అద్దం పట్టే హెచ్చరికగా మారింది. మారుతున్న జీవితం... తగ్గిపోతున్న అనుబంధాలు ఒకప్పుడు సాయంత్రం అరుగులపై కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. పండుగలంటే బంధువుల సందడి. కష్టమొస్తే ఊరంతా ఒక్కటయ్యేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచం మొత్తం మొబైల్ స్క్రీన్‌లోకి చేరిపోయింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నవారితో వీడియో కాల్ చేస్తున్నా... పక్కనే ఉన్న తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్నేహితులతో మాట్లాడేందుకు మాత్రం సమయం దొరకడం లేదు.

**ఫోన్‌లో వేల కాంటాక్టులు... జీవితంలో ఎంతమంది?**

ఈరోజు ఒక వ్యక్తికి ఫోన్‌లో వెయ్యి కాంటాక్టులు ఉండొచ్చు. సోషల్ మీడియాలో లక్షల మంది ఫాలోవర్లు ఉండొచ్చు. ప్రతి పోస్టుకు వేల లైకులు రావచ్చు. కానీ అర్ధరాత్రి ఒక సమస్య వచ్చినప్పుడు... "భయపడకు... నేనున్నాను" అని చెప్పే మనిషి ఎంతమంది? అదే అసలు ప్రశ్న. అదే నిజమైన బంధం. సంపాదిస్తున్నాం... కానీ కోల్పోతున్నది ఏమిటి? ఉద్యోగాలు పెరిగాయి. జీతాలు పెరిగాయి. ఇళ్లు పెద్దవయ్యాయి. కార్లు ఖరీదైనవయ్యాయి. కానీ కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోయింది. ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఒకరికొకరు మెసేజ్‌లు పంపుకునే పరిస్థితి వచ్చింది. భోజనానికి అందరూ ఒకే టేబుల్ వద్ద కూర్చున్నా... సంభాషణ మాత్రం మొబైల్‌తోనే జరుగుతోంది. నవ్వులు తగ్గుతున్నాయి. పలకరింపులు తగ్గుతున్నాయి. మనసులు దూరమవుతున్నాయి. సోషల్ మీడియా సాధనం మాత్రమే... ప్రత్యామ్నాయం కాదు సోషల్ మీడియా సమాచారాన్ని అందించింది. ప్రపంచాన్ని దగ్గర చేసింది. అవకాశాలను పెంచింది. కానీ... అది అమ్మ ప్రేమను భర్తీ చేయలేదు. నాన్న భుజాన్ని ఇవ్వలేదు. స్నేహితుడి చేయిని పట్టలేదు. కష్టంలో కన్నీరు తుడవలేదు. ఒక "లైక్" గుండెను ఓదార్చలేదు. ఒక "ఎమోజీ" బాధను పంచుకోలేదు. అహం పెరిగితే... బంధం తగ్గుతుంది "వాళ్లు ముందుగా ఫోన్ చేయలేదు..." "వాళ్లు మా ఇంటికి రాలేదు..." "మనం ఎందుకు వెళ్లాలి?" ఇలాంటి చిన్న ఆలోచనలే పెద్ద బంధాలను దూరం చేస్తున్నాయని సామాజిక పరిశీలకులు చెబుతున్నారు. ప్రేమ ఉన్న చోట లెక్కలు ఉండవు. లెక్కలు మొదలైన చోట ప్రేమ నిలవదు. ఒంటరితనం ఇప్పుడు ప్రపంచానికే సవాలు మానసిక నిపుణుల అభిప్రాయం ప్రకారం మనిషి సహజంగానే సామాజిక అనుబంధాల కోసం రూపొందాడు. డబ్బు, హోదా, విజయం సౌకర్యాన్ని ఇవ్వగలవు. కానీ మనశ్శాంతిని ఇచ్చేది మాత్రం ప్రేమతో కూడిన సంబంధాలే. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన సోషల్ కనెక్షన్ కమిషన్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. సామాజిక ఒంటరితనం వల్ల ప్రతి ఏడాది లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని నివేదిక హెచ్చరించింది. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, రోజూ కొంత సమయం మొబైల్‌కు దూరంగా గడపడం, బంధువులు–స్నేహితులను ప్రత్యక్షంగా కలవడం వంటి అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.అందెశ్రీ మాట... ఈ కాలానికి అద్దం తెలంగాణ గీతాన్ని రచించిన అదే కలం ఎన్నాళ్లక్రితమే అడిగిన ప్రశ్న నేడు మరింత బలంగా వినిపిస్తోంది. "మాయమై పోతున్నడమ్మా... మనిషన్న వాడు..." మాయమవుతున్నది మనిషి రూపం కాదు... మనిషిలోని మానవత్వం. తగ్గిపోతున్నది జనాభా కాదు... జనాల మధ్య ఆప్యాయత.

**నవజ్యోతి విశ్లేషణ**

సాంకేతికతను ఆపలేం. సోషల్ మీడియాను వదిలేయమని చెప్పలేం. కానీ స్క్రీన్ వెలుగు... ఇంటి వెలుగును మింగేయకుండా చూసుకోవచ్చు. స్టేటస్ పెట్టే ముందు ఒక్కసారి అమ్మానాన్నలను పలకరించండి. రీల్ చూసే ముందు పిల్లలతో పది నిమిషాలు నవ్వండి. ఫాలోవర్లను లెక్కించే ముందు... జీవితంలో మన కోసం నిలిచే మనుషులను గుర్తు చేసుకోండి.

**ఎందుకంటే...**

స్టేటస్‌లు మారిపోతాయి. పోస్టులు మరుగున పడిపోతాయి. ఫాలోవర్లు తగ్గిపోతారు. కానీ ప్రేమతో నిలబెట్టుకున్న ఒక బంధం మాత్రం జీవితాంతం మన వెంట నడుస్తుంది. చివరికి చరిత్ర గుర్తుంచుకునేది మీరు ఎంత సంపాదించారో కాదు... మీ వల్ల ఎంతమంది మనుషులు చిరునవ్వుతో జీవించారో.

**- సాయి మణికంఠ - మేనేజింగ్ ఎడిటర్**

# ఏడాది పూర్తి చేసుకున్న 'ఆపరేషన్ కవచ్'

- **ఎస్పీ రాజేష్ చంద్ర నాయకత్వంలో కామారెడ్డిలో ప్రీవెంటివ్ పోలీసింగ్‌కు కొత్త దిశ.. నేరస్థుల్లో భయం, ప్రజల్లో భరోసా...**

**కామారెడ్డి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

రాత్రివేళల్లో ప్రజలు ప్రశాంతంగా నిద్రపోవాలనే లక్ష్యంతో కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రారంభించిన 'ఆపరేషన్ కవచ్' విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆలోచనతో 2025 జూలై 25న ప్రారంభమైన ఈ ప్రత్యేక ప్రీవెంటివ్ పోలీసింగ్ కార్యక్రమం ఏడాది కాలంలో జిల్లాలో నేర నియంత్రణకు సమర్థవంతమైన వ్యూహంగా నిలిచింది. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం కంటే, నేరం జరగకుండా ముందే అడ్డుకోవాలనే లక్ష్యంతో అమలు చేసిన ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇచ్చిందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఏడాది పూర్తి సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, ఆపరేషన్ కవచ్ ద్వారా జిల్లాలో గంజాయి, డ్రగ్స్, దొంగతనాలు, అక్రమ రవాణా, రాత్రి వేళల్లో జరిగే నేరాలపై గట్టి నియంత్రణ సాధించామని తెలిపారు. ఏడాదిలో 6 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్టు చేయడంతో పాటు 403.405 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒడిశా నుంచి నాసిక్‌కు పనసపండ్ల మాటున తరలిస్తున్న దాదాపు రూ.1.93 కోట్ల విలువైన 387 కిలోలకు పైగా గంజాయిని పట్టుకోవడం ఈ ఆపరేషన్‌లో అతిపెద్ద విజయంగా నిలిచిందన్నారు. అక్రమ ఇసుక రవాణాపై 11 కేసులు నమోదు చేసి 8 లారీలు, 3 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గుట్కా రవాణా కేసులో రూ.43 లక్షల నగదు, 18 దొంగిలించిన మోటార్‌సైకిళ్లు, 5 దేశీయ తుపాకులు, ఒక ఎయిర్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆలయాలు, ఏటీఎంలలో జరిగిన చోరీలను ఛేదించి అంతర్‌రాష్ట్ర నేర ముఠాలను అరెస్టు చేయడంతో వారి కార్యకలాపాలు జిల్లాలో గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా ఏడాదిలో 5.16 లక్షలకుపైగా వాహనాలను తనిఖీ చేసి, 1.19 లక్షల మందిని పాపిలాన్ పరికరంతో పరిశీలించి, 209 మంది అనుమానితులను గుర్తించడంతో పాటు 3,572 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. కేవలం నేర నియంత్రణకే కాకుండా




మానవీయ కోణంలోనూ కామారెడ్డి పోలీసులు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రామారెడ్డి మండలంలో దొంగిలించబడిన ట్రాక్టర్‌ను రెండు గంటల్లోనే యజమానికి అప్పగించడం, నాగిరెడ్డిపేట్‌లో ప్రజల సహకారంతో దొంగలను వెంబడించి పట్టుకోవడం, ఆలయ చోరీ కేసును గంటల్లోనే ఛేదించడం, తప్పిపోయిన బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించడం వంటి ఘటనలు ప్రజల ప్రశంసలు అందుకున్నాయి. ఇటీవల గాంధారి పరిధిలో ఆపరేషన్ కవచ్ తనిఖీల్లో అడవి జంతువుల వేటగాళ్ల ముఠాను అరెస్టు చేసి 5 నాటు తుపాకులు, ఒక ఎయిర్‌గన్ స్వాధీనం చేసుకోవడం, అలాగే జిల్లాలో భారీ చోరీలు, కిడ్నాప్ కుట్రలను వేగంగా ఛేదించడం ద్వారా కామారెడ్డి పోలీసులు తమ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, "రాత్రి వేళల్లో పోలీసులు నిర్వహించే తనిఖీలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు.. నేరస్థుల్లో భయం కల్పించి, ప్రజలకు భద్రత కల్పించడానికే. ప్రజలు ప్రశాంతంగా నిద్రపోవడం కోసం పోలీసులు రాత్రంతా మేల్కొని ఉంటారు. మీ భద్రతే మా బాధ్యత" అని స్పష్టం చేశారు. ఆపరేషన్ కవచ్ విజయవంతంగా అమలు కావడంలో విశేష కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నగదు పురస్కారాలతో సత్కరించారు. కామారెడ్డి జిల్లాలో "కనిపించే పోలీసింగ్ – ముందస్తు నేర నియంత్రణ" అనే భావనను బలపరిచిన కార్యక్రమంగా ఆపరేషన్ కవచ్ నిలిచిందని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన

- **దెబ్బతిన్న రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు చైర్‌పర్సన్ ఆదేశం...**

**కామారెడ్డి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**



గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పర్యటించి వర్షాల ప్రభావాన్ని పరిశీలించారు. 13వ వార్డులో వర్షాలకు కుంగిపోయిన రహదారిని పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గిరి, ఎమ్మార్వో హిమబిందు, డీఈ హన్మంతరావు, కౌన్సిలర్లు లలిత, చిట్టిబాబు, సత్యం, భూపతి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భారీ వర్షా ల వేళ అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు పోలీసుల సూచన

## ప్రాణ రక్షణకు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి...

**భిక్కనూరు, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ సూచించారు. పాడైపోయిన లేదా పగుళ్లు ఉన్న ఇళ్లలో ఉండరాదని, అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లవద్దని తెలిపారు. విద్యుత్ స్థంభాలు, తెగిపోయిన విద్యుత్ వైర్లు, బోర్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వాగులు, వంతెనలు, నదులు పొంగిపొర్లుతున్న సమయంలో నడిచి లేదా వాహనాలతో దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తిరగవద్దని, చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు బయటకు వెళ్లకుండా చూడాలని కోరారు. తాగునీటిని మరిగించి మాత్రమే వినియోగించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈత కొట్టేందుకు, చేపలు పట్టేందుకు లేదా సెల్ఫీల కోసం వరద ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పడేయొద్దని హెచ్చరించారు. ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండి అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ అనిల్ విజ్ఞప్తి చేశారు.

# చాముండేశ్వరి బోనాల ఉత్సవాలకు బద్ధం ఇంద్రకరణ్ రెడ్డికి ఆహ్వానం



**బిక్కనూర్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

దోమకొండలోని శ్రీ చాముండేశ్వరి దేవి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆగస్టు 2న నిర్వహించనున్న బోనాల పండుగ ఉత్సవాలకు హాజరుకావాలని టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్ధం ఇంద్రకరణ్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లిలోని ఆయన స్వగృహంలో ఆలయ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు చంద్రయ్య, అనంతరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్, ఆలయ డైరెక్టర్ రాజేశ్వరి, నిమ్మ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వసతిగృహ విద్యార్థులకు నోట్ బుక్స్, సీఎం కిట్ల పంపిణీ

## బిక్కనూరు సర్పంచ్ రేఖ చేతుల మీదుగా అందజేత..



**బిక్కనూరు, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ వెనుకబడిన తరగతుల (బీసీ) బాలుర వసతిగృహం, బిక్కనూరులో గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు సీఎం కిట్లను గ్రామ సర్పంచ్ రేఖ పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిక్కనూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, వార్డు సభ్యుడు హౌజీ కరణ్, వసతిగృహ సంక్షేమ అధికారి (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్)తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు.

# లోధా మెరీడియన్‌లో హైప్రొఫైల్ పేకాట స్థావరంపై దాడి: ఏడుగురి అరెస్టు



**కూకట్‌పల్లి, జూలై 30, (నవజ్యోతి ప్రతినిధి):**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లోధా మెరీడియన్ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు మెరుపుదాడి చేశారు. 14వ అంతస్తులో పేకాట ఆడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1.40 లక్షల నగదు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో నిర్వాహకులు హైప్రొఫైల్ వ్యక్తులను టార్గెట్ చేసి ఈ దందా సాగిస్తున్నట్లు తెలిసింది. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం.



**ఉమ్మడి రంగారెడ్డి/ మొయినాబాద్, జూలై 30, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కామినేని హాస్పిటల్, కేఎంఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నక్కలపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. నగరం నుంచి విచ్చేసిన నిపుణులైన వైద్యులు గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి తగిన వైద్య సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. నగర స్థాయి వైద్య సేవలను గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకునే అలవాటు పెంపొందుతుందని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. సామాజిక సేవా దృక్పథంతో ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఈ వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన కామినేని హాస్పిటల్ యాజమాన్యానికి, కేఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులకు, సేవలందించిన వైద్య బృందానికి గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌడ్ల నిరంజన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, కామినేని హాస్పిటల్ వైద్య బృందం, కేఎంఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎన్. సంతోష్ కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ ఎం. నందు, కృష్ణ, ఆంజనేయులు, యామిని, గ్రామ నాయకులు నవీన్, కరోబార్ నరేందర్, సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## రాంలీలా మైదానానికి మౌలిక వసతులు..ఎమ్మెల్యే హామీ

- మైదానంలో బోరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు వినతి
- నూతన కమిటీకి శాలువాలతో సన్మానం..ప్రజా అవసరాలపై దృష్టి

**కుత్బుల్లాపూర్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రజలకు, యువతకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడే ప్రజా వేదికలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పేర్కొన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న సూరారం కాలనీలోని శ్రీ రాంలీలా మైదానాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.<130వ డివిజన్ సుభాష్‌నగర్ పరిధిలోని సూరారం కాలనీ శ్రీ రాంలీలా మైదానం నూతన కమిటీ సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ ఆధ్వర్యంలో పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైదానంలో నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు కొట్టే రవి, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ రవిలను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాంలీలా మైదానం వంటి ప్రజా వేదికలు కేవలం పండుగలకే కాకుండా సామాజిక, సాంస్కృతిక, యువజన కార్యక్రమాలకు కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. ఇలాంటి ప్రాంగణాల్లో మౌలిక వసతులు మెరుగుపడితే ప్రజలకు మరింత ఉపయోగకరంగా మారుతాయని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ప్రజా భాగస్వామ్యంతో మైదానం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ధారం సాయికుమార్, మాణిక్యరెడ్డి, జాయింట్ సెక్రటరీలు మాసిరెడ్డి, శ్రీనివాస్, సెక్రటరీ లక్ష్మణ్, గోవిందప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రావణ్ కుమార్, వీరన్న, భాస్కర్ రెడ్డి, సభ్యుడు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్ టీయూహెచ్ లో రిమోట్ సెన్సింగ్, ఏఐ సాంకేతికతపై వర్క్ షాప్




**కూకట్ పల్లి, జూలై 30, (నవజ్యోతి ప్రతినిధి) :**

జేఎన్‌టీయూహెచ్ గోల్డెన్ జూబ్లీ సెమినార్ హాల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఎస్ఆర్ఎస్) హైదరాబాద్ చాప్టర్, యుసిఈఎస్టిహెచ్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో "రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ డొమైన్‌లో ఏఐ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, స్మార్ట్ వ్యవసాయం, మౌలిక సదుపాయాల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఎన్ఆర్ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గా రావు మాట్లాడుతూ ఉపగ్రహ డేటాకు ఏఐ అల్గారిథమ్స్ జోడించడం ద్వారా విపత్తు నిర్వహణ, రవాణా వ్యవస్థల్లో వేగవంతమైన మార్పులు వస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఐఎస్ఆర్ఎస్ ప్రతినిధులు డాక్టర్ ఈశ్వర్ చంద్ర దాస్, ప్రొఫెసర్ టి. విజయలక్ష్మి , పలువురు నిపుణులు పాల్గొన్నారు.

# సలబత్‌పూర్ చెక్‌పోస్ట్ ఘటనపై విచారణకు ఆదేశం

- రాజస్థాన్ యూట్యూబర్ తో వివాదం.. కానిస్టేబుల్ సస్పెన్షన్ కు సిఫారసు..

**కామారెడ్డి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

సలబత్‌పూర్ ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద రాజస్థాన్‌కు చెందిన యూట్యూబర్‌తో చోటుచేసుకున్న వివాద ఘటనపై ప్రాథమిక విచారణకు ఆదేశించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెంటనే విచారణ ప్రారంభించినట్లు గురువారం వెల్లడించారు. ప్రాథమిక విచారణలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి పాత్ర ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ ఘటనపై శాఖాపరమైన పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని, నివేదికను కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, నోడల్ అధికారికి సమర్పించనున్నట్లు చెప్పారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని సిఫారసు చేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ముకుంద రెడ్డి వెల్లడించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మద్యం, గంజాయి తదితర నిషేధిత మత్తు పదార్థాల రవాణాను అడ్డుకునేందుకు సలబత్‌పూర్ చెక్‌పోస్ట్‌లో గత రెండు దశాబ్దాలుగా 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, బాధ్యులపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.




# పాల్వంచ వాగు వద్ద వరద పరిస్థితిని పరిశీలించిన జిల్లా ఎస్పీ

- వరద ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరిక.. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన...
- కామారెడ్డి, మాచారెడ్డి

**జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**



భారీ వర్షాల నేపథ్యంలో మాచారెడ్డి మండలంలోని పాల్వంచ వాగును జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఐపీఎస్ గురువారం పరిశీలించారు. వాగులో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరదను పరిశీలించిన ఆయన, పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రవాహాలు, వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు. సెల్ఫీలు, వీడియోలు, రీల్స్ కోసం వరద ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. వరద నీటితో రహదారులు మునిగిపోయిన చోట వాహనాలతో దాటేందుకు ప్రయత్నించవద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మాచారెడ్డి పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అవసరమైతే రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, మాచారెడ్డి సీఐ, ఎస్ఐతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ అనవసర ప్రయాణాలు, వరద ప్రాంతాల్లో సాహసాలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర విజ్ఞప్తి చేశారు.

# జేఎన్‌టీయూహెచ్, కోర్సెరా మధ్య కీలక ఒప్పందం

**కూకట్‌పల్లి, జూలై 30, ( నవజ్యోతి ప్రతినిధి):**



విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ కోర్సులను చేరువ చేసే దిశగా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్, ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ కోర్సెరా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.కోర్సెరా ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆదిత్య రజ్దాన్, జేఎన్‌టీయూహెచ్ వీసీ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ భాగస్వామ్యంతో జేఎన్‌టీయూహెచ్‌తో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులకు అంతర్జాతీయ నిపుణులు బోధించే కోర్సులు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు రాయితీ ధరలకే అందుబాటులోకి రానున్నాయి. ఈ సర్టిఫికేషన్ల ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని వీసీ ఆశాభావం వ్యక్తం చేశారు.బోర్డుల ఆమోదం పొందిన మూక్స్ కోర్సులనే రిజిస్ట్రేషన్ కోసం నోటిఫై చేస్తామని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వి. కామాక్షి ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో రెక్టర్ డాక్టర్ ఎ. దామోదరం, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ పార్క్ అభివృద్ధిలో నలుగురు ముఖ్యమంత్రుల పాత్ర

జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**



సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్ అభివృద్ధి వెనుక నలుగురు ముఖ్యమంత్రుల సహకారం ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గురువారం రాజీవ్ పార్క్‌ను సందర్శించిన ఆయన అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యాయామ పరికరాలు, ఫౌంటెన్ పునరుద్ధరణ పనులు, ఇతర సౌకర్యాలను పరిశీలించిన జగ్గారెడ్డి, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ పార్క్ ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కె. రోశయ్య శంకుస్థాపన చేయగా, మాజీ ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. అయితే గత పదేళ్లలో పార్క్ నిర్వహణ నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరిందని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి టీ.కే. శ్రీదేవి సహకారంతో మొదటి దశలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రెండో దశలో మరో రూ.6 కోట్లతో మరిన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాజీవ్ పార్క్‌ను ఘనంగా పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జగ్గారెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, శ్రీహరి, కౌన్సిలర్లు మహేష్, నవాజ్‌తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# శివంపేటకు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహకు

**శివంపేట, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్) :**



శివంపేట మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్షణ సేవలు అందేలా శాశ్వత అంబులెన్స్ సౌకర్యాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ శివంపేట మండల పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు అత్యవసర సమయాల్లో సరైన వైద్య సదుపాయాలు అంబులెన్స్ అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు మండల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయడంతో పాటు శాశ్వత అంబులెన్స్ ను అందుబాటులో ఉంచాలని కోరినట్లు సానుకూలంగా వివరించారు వినతిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని శివంపేట మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని శివంపేట మండల ప్రజలకు హామీ ఇచ్చినట్లు సుదర్శన్ గౌడ్ తెలిపారు ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు అశోక్ తో పాటు పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సనాతన ధర్మాన్ని విశ్వ వ్యాపితం చేసిన అధిశంకర చార్యులను, శివాజిని, ప్రతి హిందువు ఆదర్శంగా తీసుకోవాలి

- **పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న నరేష్ కుమార్ సేవలు భేష్...**
- **భాజపా తెలంగాణ ఎండోన్మెంట్ సేల్ దార్మిక సంస్థ కన్వీనర్ శ్రీ అన్న వజ్జుల సూర్య ప్రకాష్ రావ్...**

**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, జులై 30, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

సనాతన ధర్మాన్ని విశ్వవ్యాపితం చేసిన జగద్గురు ఆదిశంకర చార్లను హిందూ హైందవ జాతి చైతన్యం కోసం ప్రాణాలను కూడా లెక్కచేయని చత్రపతి శివాజీ లను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకొని ఎదగాలని తెలంగాణ ఎండోమెంట్ సెల్ ధార్మిక స్టేట్ కన్వీనర్ శ్రీ అన్నవజ్జుల సూర్యప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వ్యాస పూర్ణిమ గురిపౌర్ణిమ సందర్భంగా నవాబు పేట్ మండలం గుబ్బడి పత్తేపురంలోని శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం, శ్రీ క్రిష్ణగిరి పాదాలగుట్టను ఆయన సందర్శించి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాలు అభివృద్ధి సనాతన చరిత్రల అభివృద్ధి కోసం శ్రమించి చెందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడు ఆలయ పున నిర్మాణ స్వీకారకుడు కోటి దీపోత్సవ రాష్ట్రస్థాయి ధర్మకర్త అవార్డు గ్రహీత శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ (సతీష్ కుమార్) సేవలు అభినందనీయమన్నారు. నేటి యువతరం నరేష్ కుమార్ ను ఆదర్శంగా తీసుకొని తమ తమ గ్రామాలలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. స్టేట్ కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్ మాట్లాడుతూ తాను మా ధార్మిక సంస్థలో రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ గా ఉన్న నరేష్ కుమార్ (సతీష్ కుమార్)




ఇలాంటి మారుమూల గ్రామాల్లో దేశభక్తిని దైవభక్తిని పెంపొందించడం తమ సంస్థకే గర్వకారణమని కొనియాడారు. ప్రతి హిందూ ప్రతి శనివారం తప్పకుండా గుడికెళ్లి పూజలు చేయాలని నరేష్ కు మీరంతా సహకరిస్తే మీ గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి అని సూచించారు. స్టేట్ కార్యవర్గ సభ్యులు మణిదీప్, జిల్లా కో కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ గుబ్బడి పత్తేపురం లోని క్రిష్ణగిరి పాదాల గుట్ట ఎంతో మహిమగలదని ఇలాంటి ప్రాంతానికి పిలిపించిన నరేష్ కుమార్ కి గ్రామస్తులకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని తాము కూడా ఇలాంటి ఆలయాల నిర్మాణాలకు అండగా ఉంటామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రూరల్ కన్వీనర్ నర్సింగ్ రావ్, భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక జాయింట్ కన్వీనర్ ఆర్ నరేష్ కుమార్ (సతీష్ కుమార్) మాట్లాడుతూ పుట్టిన ఊరును జన్మనిచ్చిన తల్లిదండ్రులను మర్చిపోవద్దని శ్రీరామచంద్రుడు అన్నాడు. కాబట్టి ప్రతి ఒక్కరూ రాముని సందేశాన్ని ఆదర్శంగా తీసుకుంటే ప్రతి గ్రామం ఓ రామ రాజ్యం అవుతుందని తెలిపారు. గురు పూర్ణిమ గురు పూజత్సవమును పురస్కరించుకొని అంతప్ప గూడ గ్రామం లోని శ్రీ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున బ్రహ్మానంద ఆశ్రమ పిఠాధిపతి ఏ. నర్సింహా గౌడ్ ని, సూర్య ప్రకాష్ రావ్ ను శాలువాతో సత్కరించి గురువందనం గౌరవాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావులపల్లి రామ లక్ష్మయ్య, భూపతిరెడ్డి, ముదిరాజ్ జంగయ్య, ఆర్ రాజు, రాములు గౌడ్, వేనేంద్ర చారి, కార్తీక్, పోచయ్య, తదితరులను స్టేట్ కమిటీ అభినందించి శాలువాలు కప్పడం జరిగింది. స్టేట్ జాయింట్ కన్వీనర్ ఎస్ విజయ చౌదరి గుడి అభివృద్ధికి ఐదువేలను విజయేందర్ సింగ్ 10000 అందించడం జరిగింది. అనంతరం నరేష్ కుమార్ స్టేట్ కమిటీ అన్న వజ్జుల సూర్యప్రకాష్ ని, నిరంజన్ దేశాయ్ ని, విజయ్ చౌదరి ని, అండెం నర్సిరెడ్డి ని, ముత్యాల అనిల్ కుమార్ ని, హనుమకొండ శైలజ ని, శంకర్ చారిని, జిల్లా జాయింట్ కన్వీనర్ ఎన్.రమేష్ ని, జిల్లా జాయింట్ కన్వీనర్ డి భాస్కర్ గౌడ్ ని, జిల్లా కో కన్వీనర్ కొంగూరి కిరణ్ ని, వైబావ్, నర్సింహా రెడ్డి తదితర కార్యవర్గ సభ్యులందరికీ సన్మానించి తీర్థ ప్రసాదలను అందించడం జరిగింది. అనంతరం వచ్చిన భక్తులందరికీ అన్న వితరణ అన్న ప్రసాద వితరణ జరిగింది. పచ్చని పంట పొలాలు చల్లని చిరుజల్లులతో కూడిన గాలులో పల్లెటూరి వాతావరణం మనసులను ఆనందపరిచిందని వచ్చిన భక్తులందరూ పులకించి పోవడం జరిగింది.

# బంజారా సంస్కృతి వైభవానికి ప్రతీకగా తీజ్ మహోత్సవం



- **ఉత్సవాలకు విచ్చేసి విజయవంతం చేయాలని ముప్ప శ్రీనివాస్ రెడ్డికి ఆహ్వానం**

**నాగారం, జూలై 30,(నవజ్యోతి ప్రతినిధి) :**

నాగారం డివిజన్ తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ కాలనీ, రోడ్ నెం.10లో ఆగస్టు 2 (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న బంజారా తీజ్ మహోత్సవం ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ని కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించాలని ఆహ్వానించారు.అదేవిధంగా కుర్మ సంఘం నాయకులు భాస్కర్, గణేష్, యాదగిరి లను కూడా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, తీజ్ పండుగ బంజారా మహిళల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే అత్యంత పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో కుటుంబాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆనందం నెలకొనాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఉత్సవాల్లో సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరై బంజారా సంస్కృతి వైభవాన్ని చాటే ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెడ్యా నాయక్, భద్రు నాయక్, ప్రదీప్, జేత్రామ్ తదితరులు, తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని ఆహ్వాన పత్రికలను

# పొలాల నడుమ ప్రమాదకర నిల్వలా..?

- **అనుమతుల మాటేమిటి...కెమికల్ గోదాముల జోరేమిటి..?**
- **ఫైర్, కాలుష్య నియంత్రణ, పరిశ్రమల అనుమతులపై స్పష్టత కోరుతున్న ప్రజలు**
- **ORR ఒడ్డున విషరసాయనాల గుట్టు..?**

**కుత్బుల్లాపూర్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**

ఒకప్పుడు పచ్చని పంట పొలాలకు నిలయంగా ఉన్న బౌరంపేట ప్రాంతం ఇప్పుడు క్రమంగా కెమికల్ గోదాముల కేంద్రంగా మారుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట సర్వే నంబర్ 189లో "నోబెల్ లైఫ్ సైన్స్" పేరుతో నిర్వహిస్తున్నట్లు చెబుతున్న కెమికల్ గోదాంపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికుల సమాచారం ప్రకారం అక్కడ ప్రమాదకర రసాయనాలను నిల్వ చేయడమే కాకుండా, కెమికల్స్ మిక్సింగ్ కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాలపై సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. ఒకప్పుడు వ్యవసాయానికి ప్రసిద్ధి చెందిన బౌరంపేట ప్రాంతంలో ఇటీవల కెమికల్ గోదాములు పెరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



గతంలో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్య సమస్యలు ఎదురైన నేపథ్యంలో, అదే పరిస్థితి ఇప్పుడు బౌరంపేటకు విస్తరించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ట్రేడింగ్ పేరుతో వేరే కార్యకలాపాలా..?**

స్థానికుల కథనం ప్రకారం ట్రేడింగ్ పేరుతో అనుమతులకు మించి ప్రమాదకర రసాయనాల నిల్వ, మిక్సింగ్ వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన కెమికల్ కంటైనర్లు, కవర్లను శుభ్రపరిచే గోదాములు నడిచిన ఘటనలను గుర్తుచేస్తూ, ఇప్పుడు మరింత ప్రమాదకర కార్యకలాపాలు జరుగుతున్నాయేమోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఫైర్ అనుమతులపై సందేహాలు**

సమాచారం మేరకు సంబంధిత గోదాంలో అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నాయా లేదా అన్న అంశంపై స్పష్టత లేదని స్థానికులు చెబుతున్నారు. భారీ మొత్తంలో కెమికల్ డ్రమ్‌లు నిల్వ ఉన్న భవనంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలు (ఎగ్జిట్‌లు) సరిపోతున్నాయా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పచ్చని వాతావరణానికే ముప్పు..?**

ఓఅర్ ఆర్ సమీపంలో పరిశుభ్రమైన వాతావరణం కారణంగా అనేక అంతర్జాతీయ విద్యాసంస్థలు, నివాస కాలనీలు ఏర్పడ్డాయి. అలాంటి ప్రాంతంలో ప్రమాదకర రసాయనాల నిల్వ, నిర్వహణ కొనసాగితే పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**అధికారుల తనిఖీలే పరిష్కారం**

దుండిగల్ సర్కిల్ పరిధిలో ఇటువంటి కెమికల్ గోదాములు పెరుగుతున్నాయంటే క్షేత్రస్థాయిలో తనిఖీలు తగిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖ, రెవెన్యూ, స్థానిక సంస్థల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, అనుమతులు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ నిబంధనలు పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాల భవనం కూలిపోవడం వల్ల తప్పిన ప్రమాదం

**ఉమ్మడి మెదక్ (నవజ్యోతి ప్రతినిధి) :**



మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఏ క్లాస్ పూర్ గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి పాఠశాల గోడ కూలడం జరిగింది. శిథిలావస్థలో ఉన్న పాఠశాలను గురించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇలాంటి శిథిలావస్థలో పాఠశాలను కూల్చి వేసి నూతన పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇక్కడ విద్యార్థులు లేక పోవడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదని గ్రామస్తులు చెపుతున్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థుల సంఖ్య సుమారు 30 నుండి 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగం మరియు మంత్రి చర్యలు తీసుకొని నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే మర్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తోట రూపేందర్ రెడ్డి

**అల్వాల్/జూలై 30, (నవజ్యోతి ప్రతినిధి) :**

కౌకూర్‌కు చెందిన తోట రూపేందర్ రెడ్డి గురువారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పార్టీ సిద్ధాంతాలు ప్రజా సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ప్రాధాన్యత ఉంటుందని పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు



జేఏసీ వెంకన్న,అనిల్ కిషోర్ గౌడ్,రాజు యాదవ్,శ్రీధర్ గౌడ్, సురేష్,జనార్దన్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల వేగవంతమైన చర్యలు.. గంటల్లోనే తప్పిపోయిన వ్యక్తి గుర్తింపు



- **దమ్మాయిగూడలో దారితప్పిన వ్యక్తిని గుర్తించి సురక్షితంగా అప్పగించిన పోలీసులు**
- **వాట్సాప్ అలర్ట్ ఫలించింది.. తప్పిపోయిన వ్యక్తి సురక్షితంగా లభ్యం**
- **ప్రజల సహకారం – పోలీసుల చాకచక్యం.. మిస్సింగ్ కేసుకు సుఖాంతం**

**కుషాయిగూడ, జూలై 30,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ పోలీసుల అప్రమత్తత, ప్రజల సహకారం మరోసారి ఫలించింది. కుషాయిగూడలోని విస్టా హోమ్స్ నుంచి తప్పిపోయిన భృందావన్ సాహో అనే వ్యక్తి వివరాలను పోలీసులు వెంటనే వివిధ వాట్సాప్ గ్రూపులు, సహచరి గ్రూపుల్లో ప్రచారం చేశారు. సాంకేతిక ఆధారాలు, స్థానికుల నుంచి అందిన సమాచారాన్ని సమన్వయం చేస్తూ దమ్మాయిగూడ ప్రాంతంలో దారితప్పి తిరుగుతున్న భృందావన్ సాహోను పోలీసులు గుర్తించి సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పిలిపించి ఆయనను క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోలీసులు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే త్వరితగతిన స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఇటువంటి ఘటనలను సమర్థవంతంగా పరిష్కరించగలుగుతున్నామని పేర్కొన్నారు.

# ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి..

**వాల్ పోస్టర్ ఆవిష్కరించిన బీజేవైఎం**

**చేర్యాల రూరల్, జూలై 30, :**

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకుడు సోగాల మనోజ్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలైన రూ.15 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఈ పథకం ఎంతో కీలకమైందని, అయితే ప్రభుత్వం రాష్ట్రములోని సుమారు 45 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తును అయోమయంలో పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, తల్లిదండ్రులు ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే నిధులను విడుదల చేయాలని అన్నారు.

## జి.ఎస్.ఎస్.సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకి ఉచితంగా స్కూల్ బ్యాగ్ లు పంపిణీ





**వాజేడు, (నవజ్యోతి ప్రతినిధి) :**

వాజేడు మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీ పరిధిలోని బొల్లారం గ్రామం లో గురువారం జి.ఎస్. ఎస్. సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల నందు సుమారు డెబ్బై మంది విద్యార్థులకు ఉచితంగా స్కూలు బ్యాగ్ లు, నోట్ పుస్తకాలు, పెన్నులుమరియు పలకలు పాఠశాల ప్రధానోపాధ్యురాలు v. విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ సూపర్వైజర్ రాము మాట్లాడుతూ పేద, వెనకబడిన విద్యార్థులకు సంస్థ ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈయెక్క కార్యక్రమానికి సంస్థ సూపర్వైజర్ లు రాము, మురళి రెడ్డి, శ్యామ్, నవీన్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుపై అధికారుల స్పందన..
### చిరుమర్తి చెక్ డ్యాం పరిశీలన





**మాడుగులపల్లి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**

చిరుమర్తి గ్రామంలోని చెక్డ్యాం ఆక్రమణ, ధ్వంసంపై ప్రజావాణిలో రైతు ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన జిల్లా కలెక్టర్, విచారణకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సరోజ పావని, ఇరిగేషన్ ఏఈఈ వేణుగోపాల్, ఆర్ఐ శ్యామ్, వీఆర్వో రామారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై వివరాలు సేకరించిన అధికారులు, చెక్డ్యాంను ధ్వంసం చేసినట్లు తేలితే పూర్వస్థితికి పునరుద్ధరించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈఈ వేణుగోపాల్ హెచ్చరించారు. వర్షాల కారణంగా చెక్డ్యాంకు నష్టం జరిగితే సమీప వ్యవసాయ భూములు దెబ్బతినే ప్రమాదం ఉందని, వ్యవసాయ మోటార్ల వద్దకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు అధికారులకు వివరించారు. చెక్డ్యాంను పూర్వస్థితికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని వారు కోరగా, పూర్తి స్థాయి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

## రామ్ నరేష్ కాలనీలో పారిశుద్ధ్య పనులపై డీసీ తనిఖీ

**కూకట్ పల్లి, జూలై 30, ( నవజ్యోతి ప్రతినిధి):**



హైదర్‌నగర్ 243వ వార్డు పరిధిలోని రామ్ నరేష్ కాలనీలో పారిశుద్ధ్య పనులపై ఆల్విన్ కాలనీ డీసీ చాముండేశ్వరి తనిఖీలు చేపట్టారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ జరుగుతున్న తీరును ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్‌తో నేరుగా మాట్లాడి రోజువారీ సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నుంచి క్రమం తప్పకుండా చెత్తను సేకరిస్తున్నారా లేదా అన్నది నిర్ధారించుకునేందుకు సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకూడదని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీసీ వెంట ఎస్ఆర్‌పి, ఎస్ఎఫ్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ యూఐ స్పోర్ట్స్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ

**కూకట్ పల్లి, జూలై 30, ( నవజ్యోతి ప్రతినిధి):**



ఆగస్టు 17 నుంచి చింతల్ హెచ్ఎంటీ గ్రౌండ్స్‌లో జరగనున్న 20వ రాజీవ్ గాంధీ మెమోరియల్ ఎన్ఎస్‌యూఐ స్పోర్ట్స్ మీట్-2026 పోస్టర్‌ను న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ ఆవిష్కరించారు.క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెరుగుతాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. 19 ఏళ్లుగా ఈ క్రీడాపోటీలను నిరంతరాయంగా నిర్వహిస్తున్న టీజీ-ఎన్ఎస్‌యూఐ నాయకుడు గొల్ల జాన్‌ను అభినందించారు. ఆగస్టు 17 నుంచి 22 వరకు జరిగే ఈ క్రీడా మహోత్సవానికి తాను స్వయంగా హాజరవుతానని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి అనులేక, కోఆర్డినేటర్ మన్నె జీవన్, రాష్ట్ర నాయకులు నాగేంద్ర బాబు, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలతో అనుచిత ప్రవర్తన.. నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

- కుషాయిగూడ కోర్టు తీర్పు.. మహిళల భద్రతపై రాజీ లేదని స్పష్టం

**కుషాయిగూడ, జూలై 30,(నవజ్యోతి ప్రతినిధి) :**



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలతో అనుచితంగా ప్రవర్తించిన కేసులో నిందితుడు రామ్ షకల్ ఠాకూర్ (42), యాప్రాల్ నివాసిను గురువారం గౌరవనీయులైన వి స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, కుషాయిగూడ ఎదుట పోలీసులు హాజరుపరిచారు.కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి రూ.500 జరిమానాతో పాటు సాధారణ కారాగార శిక్ష విధించింది. మహిళల భద్రతకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## పాటతో ఒక పూట పోస్టర్ ఆవిష్కరణ

**మిర్యాలగూడ, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి)**



కళలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో పాటతో ఒక పూట పేరుతో సామాజిక చైతన్య, దేశభక్తి గీతాలు, సంగీతం, సాహిత్యం, నృత్య రూపకాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆగస్టు 14న మిర్యాలగూడలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త జాడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం షెడ్యూల్డ్ కులముల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాడి రాజు మాట్లాడుతూ, సమాజంలో దాగి ఉన్న ప్రతిభావంతులైన కళాకారులకు గుర్తింపు కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దేశభక్తి గీతాలు, సామాజిక చైతన్య గీతాలు, సంగీత ప్రదర్శనలు, నృత్య రూపకాలు తదితర సాంస్కృతిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాడుగుల శ్రీనివాస్, నకిరేకంటి కిరణ్ కుమార్, డాక్టర్ మునీర్, మాలోతు దశరథ్ నాయక్, బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, మహమ్మద్, దాసరాజు జయరాజు, సోమ ఆంజనేయులు, కాకునూరి రవి, జగదీశ్వర్ రెడ్డి, వట్టికోట శ్రీను వెన్నెల, నక్క నాగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నవారు కాదన్నా.. అవ్వకు కొడుకయ్యాడు

**కూకట్‌పల్లి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

కన్న కొడుకులు పట్టించుకోని ఓ 80 ఏళ్ల వృద్ధురాలికి రాష్ట్ర భాజపా సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అండగా నిలిచారు. వినికిడి లోపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆమెకు స్వయంగా వైద్య పరీక్షలు చేయించి వినికిడి పరికరాన్ని అందజేశారు.కూకట్‌పల్లి వెంకటేశ్వర నగర్‌కు చెందిన విరమ్మ రెండు చెవులు వినిపించక అవస్థలు పడుతూ, కుమార్తె సాయంతో రాజేశ్వరరావును ఆశ్రయించింది. ఆమె పరిస్థితి చూసి చలించిపోయిన ఆయన.. "బాధపడకు అవ్వా.. నేను నీ కొడుకు లాంటివాడిని" అంటూ ఆసుపత్రికి తీసుకెళ్లి ధ్వని పరికరాన్నిఇప్పించారు. ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇవ్వడంతో విరమ్మ కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపింది. మానవత్వంతో స్పందించి నిస్సహాయురాలి జీవితంలో వెలుగు నింపిన రాజేశ్వరరావును స్థానికులు అభినందించారు.



## చంద్రయ్య సేవలు ఆదర్శప్రాయం..

- ఘనంగా ఉద్యోగ విరమణ
- విధి నిర్వహణలో చేసిన సేవలే శాశ్వత గుర్తింపు: సీఎంఓ భీమ్ గొండ

**సంగారెడ్డి(హత్నూర), జూలై 30(నవజ్యోతి ప్రతినిది):**




విధి నిర్వహణలో నిబద్ధతతో చేసిన సేవలే ఉద్యోగికి శాశ్వత గుర్తింపును తీసుకువస్తాయని సీఎంఓ భీమ్ గొండ అన్నారు. హత్నూర మండలంలోని కాసాల గ్రామ శివారులోని బీఎన్ రెడ్డి గార్డెన్‌లో హత్నూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సాయమొల్ల చంద్రయ్య పదవీ విరమణ సందర్భంగా గురువారం నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రయ్య తన ఉపాధ్యాయ సేవా కాలంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేశారని, ఆయన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమైన ఘట్టమేనని, అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన సాయమొల్ల చంద్రయ్య మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకట్ స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రాజ్, రాష్ట్ర నాయకుడు దశరథ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాదరి బాల్‌రాజ్, నల్గొండ జిల్లా అధ్యక్షులు బిక్షపతి గోపాల్, గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి, హత్నూర సర్పంచ్ ఎల్లయ్య, కాసాల పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,

## భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయి పనులను పర్యవేక్షించిన చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు.

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశాలతో రంగంలోకి దిగిన మున్సిపల్ యంత్రాంగం.
- జేసీబీలు, శానిటేషన్ సిబ్బందితో మురుగు కాలువల శుభ్రపరిచే పనులు
- 3వ వార్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నిల్వ నీటి తొలగింపు.

**రామాయంపేట,జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



రామాయంపేట పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు వార్డుల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా 3వ వార్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో గత కొన్ని రోజులుగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజ్ కౌన్సిలర్ గుగులోత్ రవితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జేసీబీ సహాయంతో నిల్వ నీటిని తొలగించడం, గుంతలను పూడ్చడం, మురుగు కాలువల్లో అడ్డంకులను తొలగించే పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తున్నామని, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు చింతల యాదగిరి,కౌన్సిలర్ గుగులోతు రవి, యాదగిరి, మిషన్ భగీరథ సిబ్బంది, శానిటరీ జవాన్లు ప్రవీణ్, రమేష్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షలతో కూలిన ఇళ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

- **బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా**
- **తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**



**రామాయంపేట,జూలై 30 (నవజ్యోతి):**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో కురిసిన అకాల భారీ వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోయిన ఘటన చోటుచేసుకుంది. 7వ వార్డుకు చెందిన సక్కుబాయి, 1వ వార్డుకు చెందిన ఎర్రం జయరాములు నివాసాలు దెబ్బతినడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌస్తో కలిసి నష్టాన్ని పరిశీలించి, బాధితులకు అవసరమైన తక్షణ సహాయ చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉన్న సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబాలకు మున్సిపాలిటీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్, బుర్ర రమేష్, మానుక శివ, నక్క శ్రీను, మంగల్ పవన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా మున్సిపల్ చైర్‌పర్సన్

- **మృతుల కుటుంబాలకు రూ.5 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత**
- **పరామర్శించి ధైర్యం చెప్పిన మున్సిపల్ చైర్‌పర్సన్**





**రామాయంపేట, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ):**

రామాయంపేట మున్సిపాలిటీ 7వ వార్డులో వరుసగా జరిగిన విషాద ఘటనల నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజ్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.7వ వార్డు గోల్పర్తికి చెందిన బొగ్గుల చిన్న సిద్ధరాములు కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ వెంటనే వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ సహాయంగా రూ.5,000 నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అలాగే 7వ వార్డులోనే కమతం దేవమ్మ మరణించిన విషయం తెలుసుకుని ఆమె కుటుంబాన్ని కూడా పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల సహకారంతో రూ.5,000 నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో చింతల యాదగిరి, తొంటావలి యాదగిరి, ఎర్రం సత్యం, ఎర్రం యాదగిరి, సాదుల పరుశరాములు, పచ్చటి రాము, రొయ్యాల స్వామి, పాత నరేష్, కార్తీక్, బైరాం కుమార్, మధునాల స్వామి గౌడ్, గావు భాస్కర్, బొట్ల బాబు, బొర్రా అనిల్, అసాది రాజు, బైరాం శంకర్, బైరాం శ్రీనివాస్, ఒద్ది స్వామి, బైరాం పెద్దస్వామి, బొర్రా రమేష్, గావు సతీష్, ఉట్ల బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చల్మెడలో మృతుల కుటుంబాలకు అండగా డాక్టర్ మోహన్ నాయక్

- **రెండు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం**
- **కష్టకాలంలో అండగా ఉంటానని భరోసా**



**రామాయంపేట, జూలై 30 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

రామాయంపేట ( నిజాంపేట )
చల్మెడ గ్రామానికి చెందిన చిట్టె రాజమ్మ, గండికోట కనకవ్వ మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మోహన్ నాయక్ గురువారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, రెండు కుటుంబాలకు తక్షణ సహాయంగా రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ తమ కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్మెడ గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం, ఆకుల మహేందర్, తిరుమలనాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, బాజా రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెప్పట ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానికులు డాక్టర్ మోహన్ నాయక్ మానవత్వాన్ని అభినందిస్తూ, బాధిత కుటుంబాలకు అందించిన చేయూతను ప్రశంసించారు.

## పాఠశాల పక్కన సెల్ టవర్ నిర్మించొద్దు...

- **విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు..**
- **16వ వార్డు ప్రజల డిమాండ్**
- **టవర్ నిర్మిస్తే జాతీయ రహదారి దిక్బందిస్తాం**

**తూప్రాన్, 30 జులై (నవజ్యోతి ప్రతినిధి నవీన్) :**

తూప్రాన్ మున్సిపల్ 16వ వార్డులో అక్షర స్కూల్ ప్రక్కనే కొందరు వ్యక్తులు సెల్ టవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టవర్ నిర్మిస్తే పిల్లల, పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని అనారోగ్యానికి గురవుతారు కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే నిర్మాణం పనులు నిలిపివేయాలని తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు కాల నీ వాసులకు మద్దతుగా స్థానిక 16 వార్డు కౌన్సిలర్ బొడు జోష్నా వేణు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు.. వెంటనే టవర్ నిర్మాణ పనులు నిలిపి వేయకపోతే రహదారిపై రాస్తారోకో చేసే దృక్బందిస్తామని పిల్లల తల్లిదండ్రులు కాలనీ వాసులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో 16 వార్డ్ కౌన్సిలర్ బొడ్డు జోష్న వేణు, నవ్వుతు శ్రీనివాస్, గంప సిద్దిరాములు గడ్డం శ్రీనివాస్ గట్టు శేఖర్ కే వేణుగోపాల్ వీరేష్



సిద్ధిరాములు అక్షర స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## పుప్పాల వాగును పరిశీలించిన తహసీల్దార్ రజినీ కుమారి

- **ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లతో అప్రమత్తమైన రెవెన్యూ యంత్రాంగం**
- **వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దని ప్రజలకు హెచ్చరిక**



**రామాయంపేట, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

రామాయంపేట: మండలంలోని పర్వతాపూర్–కాట్రీయాల్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పుప్పాల వాగును మండల తహసీల్దార్ రజినీ కుమారి గురువారం పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వాగులో నీటి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో వాగు పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ప్రజల భద్రతే ప్రధానమని పేర్కొన్న ఆమె, అత్యవసర పరిస్థితులు మినహా ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.వాగులు, చెరువులు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని,ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజినీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్,సర్పంచ్ తార్యనాయక్, PR AE సల్మాన్ ఖాన్,కాముని మహిపాల్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం మున్సిపల్ కౌన్సిల్‌లో అభివృద్ధి పనులకు ఆమోదం



**పటాన్చెరు(జిన్నారం), జూలై 30(నవజ్యోతి దినపత్రిక):**

జిన్నారం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను గురువారం ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ పనులు చేపట్టడంతో పాటు వాటికి అవసరమైన ఆర్థిక అనుమతులు మంజూరు చేశారు. ఆమోదించిన అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించి ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్ తెలిపారు.

## స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్



**ముమ్మిడివరం, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు):**

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆత్కూర్ స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్టును గురువారం బాలల హక్కుల కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో నిర్వహిస్తున్న విద్య, సేవా, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించి, అక్కడి నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మందాల గంగ సూర్యనారాయణ కూడా పాల్గొని ట్రస్ట్‌లో అమలు చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. సమాజాభివృద్ధి, బాలల సంక్షేమం, విద్యా ప్రోత్సాహానికి ట్రస్ట్ చేస్తున్న కృషిని వారు అభినందించారు. ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు మరింత మందికి చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్శనలో ట్రస్ట్ ప్రతినిధులు, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఈ-పెట్టీ కేసులో ఇద్దరికి ఒక రోజు సామాజిక సేవ శిక్ష

**సిటీ పోలీస్ చట్టం ఉల్లంఘనపై కుషాయిగూడ కోర్టు తీర్పు**





**కుషాయిగూడ, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి):**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం సెక్షన్ 70(B) కింద నమోదైన e-Petty కేసులో ఇద్దరికి ఒక రోజు సామాజిక సేవ చేయాలని గౌరవనీయులైన V స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, కుషాయిగూడ ఆదేశించింది. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు అభినయ్ (28), బాలకృష్ణ (30)లను కుషాయిగూడ పోలీసులు న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం ఇద్దరినీ దోషులుగా నిర్ధారించి, ప్రజల్లో సామాజిక బాధ్యత పెంపొందించే ఉద్దేశంతో ఒక రోజు సామాజిక సేవ (Community Service) చేయాలని శిక్ష విధించింది. చిన్నచిన్న చట్ట ఉల్లంఘనల విషయంలో కూడా చట్టం తన పని తాను చేస్తుందని, ప్రజలు నిబంధనలు పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కుషాయిగూడ పోలీసులు సూచించారు.

## రాజంపేటలో టీఆర్ఎస్ లోకి నాయకుల చేరిక..

### పార్టీ విస్తరణకు ఊతం



**సంగారెడ్డి, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా సంగారెడ్డి జిల్లా రాజంపేట ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు గురువారం పార్టీలో చేరారు. సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎం. హరికృష్ణ, అంజనేయులు, శివకృష్ణ, నరేష్, రమేష్, ప్రసాద్, యాదగిరి, సురేష్, అశోక్, శేఖర్, శ్రీరామ్, రవి తదితరులు తెలంగాణ రక్షణ సేనలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్ రెడ్డి, నర్సింహా రెడ్డి, రాహుల్ యాదవ్, ఆసిఫ్, అనూప్ తదితరులు పాల్గొని నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, కవితక్క పిలుపు మేరకు తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలను, "పంచజన్యం" అజెండాను ప్రతి గ్రామం, ప్రతి వాడకు చేర్చే లక్ష్యంతో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, తెలంగాణ అభివృద్ధే పార్టీ ప్రధాన ధ్యేయమని పేర్కొంటూ, ప్రజల భాగస్వామ్యంతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కొత్తగా చేరిన నాయకులు ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసి పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

### 12 ఏళ్లగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం



**హైదరాబాద్, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**

సమాజ సేవ, సుస్థిర అభివృద్ధి పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గురువారం రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్ మేట్ నోట్ బుక్ లు, క్రేయాన్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీ కిట్లతో పాటు భోజనం ప్లేట్లను పంపిణీ చేసింది. చుట్టుపక్కల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా అవసరాలకు మద్దతుగా, గత 12 సంవత్సరాలుగా గీతం నిరంతరం నిర్వహిస్తున్న సుదీర్ఘకాల అవుట్-రీచ్ కార్యక్రమంలో ఇది ఒక భాగం. ఈ పంపిణీ కార్యక్రమం, 'వ్యర్థాల నుంచి సంపద' (Wealth out of Waste - WoW) అనే నినాదంతో గీతం చేపడుతున్న సుస్థిరతా ప్రయత్నం. ఈ కార్యక్రమం ద్వారా, గీతం విద్యార్థులు ఆతిథ్య విభాగం సహకారంతో ప్రాంగణం నుంచి చదివేసిన వార్తాపత్రికలు, పాత రికార్డులు, పుస్తకాలు, ఇతర పునర్వినియోగ కాగితపు సామగ్రిని సేకరిస్తారు. ఈ సామగ్రిని రీసైక్లింగ్ కోసం ఐటీసీ పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ విభాగానికి అప్పగిస్తారు. ప్రతిఫలంగా, ఐటీసీ క్లాస్ మేట్ విద్యా ఉత్పత్తులను అందిస్తుంది. వీటిని పేద విద్యార్థులకు పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత రెండింటినీ గీతం ప్రోత్సహిస్తోంది. ఈ విద్యా కిట్లను గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్రకుమార్, గీతం పూర్వ విద్యార్థి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనూజ్ తదితరులు పంపిణీ చేయగా, ఇ-క్లబ్ చైర్మన్ మాధవ్ భాస్కర్, ఇ-క్లబ్ సభ్యులు సహకరించారు. విద్యార్థులు నోట్ బుక్ లు, స్టేషనరీ కిట్లను ఎంతో ఉత్సాహంగా స్వీకరించి, చిరునవ్వులతో, హృదయపూర్వక కృతజ్ఞతతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు గీతం, ఐటీసీ అందిస్తున్న నిరంతర మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంపై శాశ్వత సానుకూల ప్రభావాన్ని సృష్టించే కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్య, పర్యావరణ సుస్థిరత, అర్థవంతమైన సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి గీతం కట్టుబడి ఉందని చెప్పారు.

## తోట మల్లయ్య ని పరామర్శించిన ఎమ్మెల్యే జారే

**దమ్మపేట, జూలై 30 :**

దమ్మపేటకు చెందిన తోట మల్లయ్య తండ్రి పొట్టియ్య ఇటీవల మరణించగా గురువారం అశ్వారావుపేట శాసనసభ్యులు మల్లయ్య నివాసంకు వెళ్ళి దివంగత పొట్టియ్య చిత్రపటానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ధైర్యాన్ని కల్గించాలి అని ఆకాంక్షించారు. పరామర్శించినవారిలో స్థానిక నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, నాయకులు చిన్నశెట్టి యుగంధర్, గుర్రం మల్లేశ్, చిన్నశెట్టి గోపి, పిట్టల శ్రీను, గట్ల నాగరాజు, శంకరవర గ అయ్యప్ప, జెట్టి వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాబోయే నాలుగు రోజులు అత్యంత కీలకం..

- **ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయండి..**
- **పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు,జులై 30(నవజ్యోతి ప్రతినిధి) :**

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగియడానికి మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని.. ఎస్ఐఆర్ లో తమ ఓటు వివరాలు నమోదు చేయించుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ లో పాల్గొని..పూర్తి వివరాలు అందించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పటాన్చెరు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని.. ప్రతి ఓటుకు దేశం, రాష్ట్రం, నియోజకవర్గ అభివృద్ధి నిర్ణయించే శక్తి ఉంటుందని అన్నారు. గురువారం ఉదయం పటాన్చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో నియోజకవర్గస్థాయి ముస్లింలు, క్రిస్టియన్లు, మిల్లర్స్, సెంట్రింగ్ అసోసియేషన్ సభ్యులకు ఎస్ ఐ ఆర్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 రోజులుగా ఎస్ఐఆర్ అంశంపై నియోజకవర్గ వ్యాప్తంగా సమావేశాలు, సదస్సులతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జూలై 30వ తేదీ ఉదయం 10:00 గంటల వరకు నియోజకవర్గం వ్యాప్తంగా 63.27 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని తెలిపారు. బిఎల్ వోల ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. తిరిగి ఇవ్వకుండా ఉన్న ప్రతి ఓటరు వెంటనే వాటిని సమర్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన బలమైన ఆయుధం ఓటు హక్కు అని.. దీనిని నిర్లక్ష్యం చేయడం అంటే మన బంగారు భవిష్యత్తును చీకటిమయం చేసుకోవడమేనని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఓటు అత్యంత కీలకమని.. స్థానికంగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని.. నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ప్రార్థన స్థలాలలో రాబోయే నాలుగు రోజులపాటు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, నియోజకవర్గ

## జామామసీద్-ఎ-రహీమా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి శంకుస్థాపన





### ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన

**అల్వాల్/జూలై 30, (నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వెంకటాపురం డివిజన్ లోని కానాజిగూడ అంబేద్కర్ నగర్ లో జామామసీద్-ఎ-రహీమా ఎక్స్టెన్షన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మసీదు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తై భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆకాంక్షించారు.అనంతరం వెంకటాపురం డివిజన్ లోని రామచం ద్రయ్య పార్కు ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు.అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, బీఎల్ఏలు తో మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి,నిర్ణీత గడువులోగా పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించా రు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.అదేవిధంగా బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వారికి తగిన వేతనాలు చెల్లించడంతో పాటు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జామా మసీద్ పెద్దలు ఇమామ్ మహమ్మద్ మెహమూద్,ఆరిఫ్, సయ్యద్ మోసిన్,తాజుద్దీన్,ముస్లిం మత పెద్దలు,బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్,శ్రీధర్ గౌడ్, సురేష్, ప్రకాష్, జనార్ధన్, ప్రభాకర్, కన్నా, వీరేశం, దేవేందర్, అనిల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళకు పోయిన బంగారు గొలుసు క్షణాల్లో గుర్తించిన కుషాయిగూడ పోలీసులు

- **పనిమనిషి నుంచి స్వాధీనం చేసి బాధితురాలికి అప్పగింత.. పోలీసుల సేవలకు ప్రశంసలు**




**కుషాయిగూడ, జూలై 30,(నవజ్యోతి ప్రతినిధి):**

వృద్ధ మహిళకు చెందిన బంగారు గొలుసు చోరీకి గురైన ఘటనలో కుషాయిగూడ పోలీసులు వేగంగా స్పందించి, గంటల వ్యవధిలోనే బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించి మరోసారి తమ సమర్థతను చాటుకున్నారు.హెచ్‌బీ కాలనీలోని తిరుమల నగర్‌కు చెందిన కె. సూర్యకాంతం (79) ఈ నెల 29న తన ఇంట్లోని కబోర్డులో సుమారు 6.5 తులాల బంగారు గొలుసు ఉంచారు. మరుసటి రోజు ఉదయం గొలుసు కనిపించకపోవడంతో వెంటనే డయల్-100కు సమాచారం అందించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కుషాయిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేసిన ఇంటి పనిమనిషి చంద్రమ్మను పిలిపించి విచారించగా, ఆమె గొలుసును తీసుకున్నట్లు అంగీకరించి స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించింది. పోలీసులు వెంటనే బంగారు గొలుసును బాధితురాలికి అప్పగించారు. గొలుసు తిరిగి లభించినందున ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు చేయవద్దని బాధితురాలు స్వయంగా పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ, "ఒక్క ఫోన్‌కే స్పందించి నా బంగారు గొలుసును తిరిగి అందించిన కుషాయిగూడ పోలీసులకు జీవితాంతం రుణపడి ఉంటాను" అని కృతజ్ఞతలు తెలిపారు.కుషాయిగూడ పోలీసులు ప్రజలు ఇలాంటి ఘటనలు జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని, సమయానికి ఫిర్యాదు చేస్తే ఆస్తుల రికవరీకి మరింత అవకాశం ఉంటుందని సూచించారు.

# కట్న వేధింపుల కేసులో జీవిత ఖైదు

- **ఏడేళ్ల తర్వాత బాధిత కుటుంబానికి న్యాయం.. కీసర పోలీసుల సమర్థ దర్యాప్తుకు ఫలితం**



**కీసర, జూలై 30 (నవజ్యోతి ప్రతినిధి) :**

అదనపు కట్నం కోసం భార్యను వేధించి, ఆమె అనుమానాస్పద మృతికి కారణమైన భర్తకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ కుషాయిగూడలోని ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. కీసర పోలీసుల సమగ్ర దర్యాప్తు, బలమైన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితుడికి శిక్ష పడింది. కీసర పోలీస్ స్టేషన్‌లో 2019 ఆగస్టు 8న నమోదైన క్రైమ్ నెం.367/2019 కేసులో, వివాహానంతరం అదనపు కట్నం కోసం భార్య శ్రావణిని శారీరకంగా, మానసికంగా వేధించడం, అనంతరం ఆమె అనుమానాస్పద మృతి చెందడంతో పోలీసులు సెక్షన్ 304-బీ ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాలను న్యాయస్థానం ముందు సమర్పించగా, గౌరవ ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి బాలభాస్కర్ ఎస్.సి. నెం.79/2021లో తీర్పు వెలువరిస్తూ నాగారం రాజ్‌సుఖ్ నగర్ కాలనీకి చెందిన కుంచాల రామాంజనేయులు (32)ను దోషిగా నిర్ధారించారు. నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తును అప్పటి ఏసీపీ, ప్రస్తుతం మల్కాజిగిరి కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శివకుమార్ సమర్థంగా నిర్వహించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డేవిడ్ రాబర్ట్సన్ సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ రవితేజ, సమన్స్ అధికారి డి.భాస్కర్, లైజన్ అధికారి పి.డి.దివిరాజు, మానిటరింగ్ అధికారి పి.నరసింహారెడ్డి సమన్వయంతో విచారణ విజయవంతమైంది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు బృందం, ప్రాసిక్యూషన్ అధికారులు, పోలీసు సిబ్బందిని మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్, ఐపీఎస్ అభినందించారు. కీసర సీఐ ఆర్కపల్లి అంజనేయులు మాట్లాడుతూ, మహిళలపై కట్న వేధింపులు, గృహహింస వంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, బాధితులు నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మహిళల భద్రతకు కీసర పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN